ప్రజాశక్తి

గురువారం 9 జనవరి 2025

రాజమండ్రికి ప్రత్యేక సర్వీసులు

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

సంక్రాంతి సందర్భంగా పార్వతీపురం నుంచి రాజమండ్రి వెళ్లేందుకు ఆర్‌టిసి ప్రత్యేక సర్వీసులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ దుర్గ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 17, 18, 19 తేదీలలో మధ్యాహ్నం రెండు గంటలకు అల్ట్రా డీలక్స్ బస్సు రాజమండ్రికి బయల్దేరుతుందని చెప్పారు. అదే బస్సు తిరిగి రాజమండ్రి నుండి 18, 19, 20 తేదీలలో ఉదయం 6.30 గంటలకు బయల్దేరి, పార్వతీపురం చేరుతుందని తెలిపారు. apsrtconline.in సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో టిక్కెట్లు బుక్ చేసుకోవచ్చని చెప్పారు.

బస్సుల కోసం వేచి ఉన్న ప్రయాణికులు

మోడీ సభకు బస్సులు ప్రయాణికులకు పాట్లు

విశాఖలో జరిగిన ప్రధాని మోడీ బహిరంగ సభకు ఆర్‌టిసి బస్సులనింటినీ అధికారులు తరలించడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. బస్సులు లేకపోవడంతో కాంప్లెక్స్ కు వచ్చిన ప్రయాణికులు గంటల తరబడి నిరీక్షించి ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించి గమ్యస్థానాలకు చేరుకునేందుకు నానా పాట్లు పడ్డారు. బస్సులు లేక ఉమ్మడి జిల్లాలోని ఆర్‌టిసి కాంప్లెక్సులన్నీ నిర్మానుష్యంగా కనిపించాయి.

బస్సుల్లేకపోవడంతో విజయనగరం ఆర్‌టిసి కాంప్లెక్సు ఆవరణలో భోజనం చేస్తున్న ప్రయాణికులు

ప్రజాశక్తి-విజయనగరంకోట, పాలకొండ

విజయనగరం జిల్లాలోని విజయనగరం, శృంగవరపుకోట ఆర్‌టిసి డిపోల నుంచి ఉన్న 175 బస్సుల్లో 100 బస్సులకుపైగా, పార్వతీపురం మన్యం జిల్లాలోని పార్వతీపురం, సాలూరు, పాలకొండ డిపోల నుంచి 80 బస్సులను ప్రధానమంత్రి మోడీ సభకు విశాఖకు బుధవారం తరలించారు. దీంతో ప్రయాణికులు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. విజయనగరం నుంచి 24 వేల మందిని తరలించడానికి పూనుకోవడంతో ఈ ఆర్‌టిసి బస్సులతో పాటు ప్రైవేటు విద్యాసంస్థలకు చెందిన మరో 50 బస్సులు వరకు కేటాయించారు. మన్యం జిల్లాలో నాలుగు నియోజకవర్గాల నుంచి నాలుగు వేల మందిని తరలించాలని నిర్ణయించారు. ఈనేపథ్యంలో పాఠశాలలకు అధికారులు అనధికార సెలవు ప్రకటించడంతో విద్యాసంస్థలన్నీ వెలవెలబోయాయి. బస్సులు లేకపోవడంతో విజయనగరం ఆర్‌టిసి కాంప్లెక్సులో ప్రయాణికుల అగచాట్లు అన్నీ ఇన్నీ కావు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు వేచి ఉన్నా బస్సులు రాకపోవడంలో ప్రయాణికులు హోటల్ నుంచి కాంప్లెక్సులోనే భోజనాలు చేస్తున్న ఘటనలు చోటు చేసుకున్నాయి. చంటి పిల్లల తల్లులు బస్సులు లేక పిల్లలతో గంటలు తరబడి నిరీక్షించారు. మరోపక్క కొన్ని కళాశాలలు సెలవు ప్రకటించడంతో ఇళ్లకు వెళ్లేందుకు విద్యార్థులు తమ లగేజీలు పట్టుకొని ప్లాట్‌ఫారాలపై నిరీక్షించారు. కొన్ని ప్రాంతాలకు పూర్తిగా బస్సులను రద్దు చేయడంతో వారికి ఏమి చేయాలో దిక్కుతోచలేదు. చివరకు గత్యంతరం లేని ప్రయాణికులు ప్రైవేటు వాహనాలను ఆశ్రయించారు.

మోడీ సభకు పాఠశాలల బస్సులు

ప్రధాని మోడీ సభకు ఆర్‌టిసి బస్సులతో పాటు ప్రైవేట్ పాఠశాలల బస్సులను కూడా వేశారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు సెలవు ఇచ్చి మోడీ సభకు బస్సులు పంపించడంతో అధికారుల తీరుపై తల్లిదండ్రులు మండిపడ్డారు. పాఠశాలలకు సెలవు ఇచ్చి బస్సులు వేయడం ఏమిటని ప్రశ్నించారు. బొబ్బిలి మున్సిపాలిటీ నుంచి 9 బస్సులు వేయగా వాటిలో రెండు ఆర్టీసీ బస్సులు, మిగిలినవి ఏడు ప్రైవేట్ విద్యా సంస్థలకు చెందిన బస్సులు ఉన్నాయి.

పాలకొండలో జనం రాకపోవడంతో వేచిఉంచిన బస్సు

జనం తరలింపునకు పాట్లు

పాలకొండ : విశాఖపట్నంలో ప్రధాని మోడీ సభకు జనాన్ని తరలించేందుకు అధికారులు, నాయకులు నానా పాట్లు పడ్డారు. ముఖ్యంగా పాలకొండ డిపో నుంచి 41 బస్సులు ఏర్పాటుచేశారు. దీంతో బస్సులను నింపేందుకు టిడిపి కూటమి నేతలు చాలా అగచాట్లు పడ్డారు. నాయకులు, అధికారులు ఎంత ప్రయత్నించినా, ప్రజలు మాత్రం దానికి సుముఖత చూపలేదు.

ప్రయాణికులకు ఇబ్బందులు

మోడీ సభకు జనాన్ని తరలించడానికి డిపో పరిధిలో నుంచి 41 బస్సులు కేటాయించారు. దీంతో ప్రతిరోజూ వివిధ రూట్లలో తిరిగే బస్సులు సరిపోక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కొత్తూరు, బామిని, వీరఘట్టం, రాజాం తదితర ప్రాంతాలకు బస్సులు లేక ప్రయాణికులు.. గంటల తరబడి వేచి చూడాల్సి వచ్చింది. ఈసురోమంటూ కొంతమంది ప్రయివేటు వాహనాలను ఆశ్రయించారు.

మోడీ సభకు పార్వతీపురం నుంచి నలుగురితో వెళ్తున్న బస్సు

సమావేశంలో మాట్లాడుతున్న అరకు ఎంపి తనూజారాణి

జిల్లా అభివృద్ధికి సమిష్టి కృషి

దిశ కమిటీ సమావేశంలో ఎంపి తనూజారాణి

ప్రజాశక్తి-పార్వతీపురం

జిల్లా అన్ని రంగాల్లో అభివృద్ధి చెందేవిధంగా అధికారులు సమన్వయంతో సమిష్టి కృషి చేయాలని అరకు ఎంపి తనూజారాణి సూచించారు. బుధవారం స్థానిక కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా అభివృద్ధికి చేపడుతున్న చర్యలు, వివిధ శాఖల ప్రగతిపై అధికారులతో జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశ కమిటీ) సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో మంచి వైద్యం, నాణ్యమైన విద్య అందేవిధంగా చర్యలు తీసుకోవాలని స్పష్టంచేశారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గర్భిణులు, చిన్నారుల్లో ఎనీమియా లోపాన్ని అధిగమించేందుకు గ్రామాల్లో ఎఎన్ఎం, ఆశా వర్కర్లను పంపించి రక్తహీనతతో బాధపడుతున్న వారిని దత్తత తీసుకొని పర్యవేక్షిస్తున్నామని, ప్రతి 15 రోజులకు పౌష్టికాహారం అందిస్తున్నామని డిఎంహెచ్ఒ భాస్కరరావు వివరించారు. మెరుగైన చర్యలు చేపట్టడం వల్ల రక్తహీనత బాధితుల సంఖ్య తగ్గుముఖం పడుతుందని, భవిష్యత్తులో సికిల్‌సెల్ కేసులు వచ్చే అవకాశం ఉండదని ఎంపి తెలిపారు. కుసుం పథకంలో భాగంగా సౌర విద్యుత్, వ్యవసాయం ప్రయోజనాలపై అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో ఎంపి ల్యాండ్ నిధులతో రోడ్లు డ్రెయిన్లు, కమ్యూనిటీ భవనాల నిర్మాణాల పనుల వివరాలపై ఆరా తీశారు. అవసరమైన చోట అంగన్వాడీ కేంద్ర భవన నిర్మాణాలకు, పాఠశాలలో మరుగుదొడ్ల మరమ్మతులు, ఆధునీకరణ పనులకు నిధులు మంజూరుకు ప్రతిపాదనలు పంపించాలని ఇంజినీరింగ్ అధికారులను కోరారు. జిల్లాలో ప్రధానమంత్రి అర్బన్ ఆవాస్ యోజన ఇళ్ల నిర్మాణాలను లక్ష్యంలోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ పవర్ ప్రజెంటేషన్ ద్వారా వివిధ శాఖల వారిగా పురోగతిని, అభివృద్ధి పనుల ప్రగతిని ఎమ్‌పికి తెలియజేయడంతో సంతృప్తిని వ్యక్తం చేశారు. అనంతరం జిల్లా రహదారుల అభివృద్ధిలో భాగంగా మూడు రాష్ట్ర హైవేలను జాతీయ రహదారులుగా మార్పు కోసం ప్రభుత్వానికి ప్రతిపాదించినట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్.ఎస్. శోభిత, సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ, జెడ్‌పి సిఇఒ బి.వి.సత్యనారాయణ, డిఆర్ఒ కె.హేమలత, డ్వామా పీడీ కె.రామచంద్ర రావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కె.రాబర్ట్‌పాల్, గృహ నిర్మాణ సంస్థ పీడీ ఆర్.వంశీకృష్ణ, జిల్లా గ్రామీణ నీటి సరఫరా ఇంజనీరింగ్ అధికారి ఒ.ప్రభాకరరావు, డిఆర్‌డిఎ పీడీ వై.సత్యం నాయుడు, జిల్లా పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ అధికారి ఎం.వి.నాగేష్ బాబు, డిఇఒ ఎన్.తిరుపతి నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు నిధులు మంజూరు చేయరూ..

పార్వతీపురం రూరల్ : పార్వతీపురంలోని నాలుగో వార్డు పరిధిలో ఉన్న సౌందర్య నారాయణమూర్తి నగర్ కాలనీలో మౌలిక సదుపాయాల కల్పనకు ఎంపి నిధులు మంజూరు చేయాలని ఆ కాలనీ నాయకులు ఎంపి తనూజారాణిని కోరారు. ఈ మేరకు బుధవారం మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు క్యాంపు కార్యాలయాన్ని సందర్శించిన ఎంపిని కలిసి వినతి అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాలనీలో రహదారులు, డ్రెయినేజీ సదుపాయం లేక ఇబ్బందులు పడుతున్నామని విన్నవించారు. కార్యక్రమంలో వైసిపి సీనియర్ నాయకులు జి.శంకరరావు, సర్పంచ్ పెండ స్రవంతి, కాలనీ నాయకులు జె.రామకృష్ణ, అనంత్, పెండ రమణ, జి.మాధవరావు పాల్గొన్నారు.

నిరసన చేపడుతున్న సిపిఎం నాయకులు, గిరిజనులు

'పోడు' పట్టాలివ్వాలని నిరసన

ప్రజాశక్తి-పాచిపెంట

అటవీ పోడు భూములకు పట్టాలు మంజూరు చేయాలని మండలంలోని వై.గొట్టూరు జంక్షన్ వద్ద సిపిఎం ఆధ్వర్యంలో బుధవారం గిరిజనులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా నాయకులు కోరాడ ఈశ్వరరావు మాట్లాడుతూ అటవీ హక్కుల చట్టం ప్రకారం ప్రతి గిరిజన కుటుంబానికి పది ఎకరాలు చొప్పున పట్టాలు ఇవ్వాల్సి ఉందని, ఎక్కడా అలా ఇవ్వడం లేదని చెప్పారు. ఎకరా, రెండు ఎకరాలు ఉన్నా 60 సెంట్లు, 20 సెంట్లు ఇలా కొలతలు వేసి ఇవ్వడం గిరిజనులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజన ప్రాంతాల్లో అటవీ హక్కుల చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని డిమాండ్‌చేశారు. దీనిపై గిరిజనులందరినీ కూడగట్టి పెద్దఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. వైస్ సర్పంచ్ సేబి రామయ్య, గిరిజనులు కె.సోమయ్య మాట్లాడుతూ పట్టాలు లేకపోవడంతో ప్రకృతి వైపరీత్యాల సమయంలో నష్టపరిహారం అందడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో గిరిజనులు పాల్గొన్నారు.

మోడీ పర్యటనకు వ్యతిరేకంగా నిరసన

ప్రజాశక్తి-కొమరాడ

విశాఖపట్నంలో ప్రధాని మోడీ పర్యటనకు వ్యతిరేకంగా సిపిఎం ఆధ్వర్యాన కొమరాడలో బుధవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా నాయకులు కె.సాంబమూర్తి మాట్లాడుతూ విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రయివేటీకరణ ఆలోచనను విరమించు కుంటున్నట్లు ప్రధాని మోడీ ప్రకటించాలని డిమాండ్ చేశారు. రైతులు పండించిన అన్ని రకాల పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరుతూ 43 రోజులుగా నిరవధిక నిరాహార దీక్ష చేస్తున్న రైతు జగత్ సింగ్ దలేవాల్ పట్ల కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించాలని కోరారు.

భూసేకరణ చట్టం 2013ను పునరుద్ధరించాలని, వ్యవసాయ రుణాలు మాఫీ చేయాలని, రైతులకు, వ్యవసాయ కూలీలకు పింఛను ఇవ్వాలని డిమాండ్‌చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు, రైతులు

టిడిపి నాయకుడికి రిటర్న్ గిఫ్ట్

గిరిజన సంక్షేమ డిడిగా కృష్ణవేణి

ప్రజాశక్తి-పార్వతీపురం

పార్వతీపురం మన్యం జిల్లాలో కురుపాం నియోజకవర్గానికి చెందిన టిడిపి గిరిజన నాయకుడు కృష్ణబాబుకు ప్రభుత్వం రిటర్న్ గిఫ్ట్ ఇచ్చింది. గత ఎన్నికల్లో కురుపాం నియోజకవర్గ టిడిపి ఎమ్మెల్యే సీటు ఆశించిన కృష్ణబాబు... పార్టీ గెలుపు కోసం పని చేశారు. ఎమ్మెల్యేగా తోయక జగదీశ్వరి విజయం వెనుక ఆయన కృషి కొంతవరకు ఉంది. ఈ నేపథ్యంలో ఆయనకు నామినేటెడ్ పోస్టు ఇవ్వకుండా ఆయన భార్య కృష్ణవేణికి గిరిజన సంక్షేమ డిడి పోస్టును కట్టబెట్టారు.

శ్రీకాకుళం జిల్లాలో సహాయ గిరిజన సంక్షేమ అధికారిగా ఉన్న కృష్ణవేణిని సాలూరు సహాయ గిరిజన సంక్షేమ అధికారిగా నియమిస్తూ తొలుత ఉత్తర్వులు వెలువడ్డాయి. తాజాగా ఆమెనే గిరిజన సంక్షేమ డిడిగా నియమిస్తూ ఉత్తర్వులు కూడా జారీ అయ్యాయి. ఇంతవరకు గిరిజన సంక్షేమ డిడిగా సాంఘిక సంక్షేమ డిడి గయాజుద్దీన్ వ్యవహరించారు. రాజు తలచుకుంటే దెబ్బలకు కొదువలేదన్న చందంగా అధికార పార్టీ అనుకుంటే ఆ పార్టీ నాయకులు కోరుకున్న అధికారులను ఆశించిన స్థానంలో కూర్చోబెట్టవచ్చునని స్పష్టమైంది.

రెగ్యులర్ డిడిగా పని చేసిన రుక్మాంగదయ్యను కొద్ది నెలల క్రితం జిల్లా కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ సరెండర్ చేశారు. ఆయనను సరెండర్ చేయడానికి బలమైన కారణాలేవీ లేకపోయినా, అధికారపార్టీ నాయకుడు కృష్ణబాబు భార్యని డిడి పోస్ట్‌లో కూర్చోబెట్టడానికే సరెండర్ చేశారనే వాదనలు అప్పట్లో వినిపించాయి. కొద్దినెలల క్రితమే 'ప్రజాశక్తి'లో ఈ వ్యవహారానికి సంబంధించిన కథనం ప్రచురితమైంది. జిల్లాకు చెందిన మంత్రి అండతో గిరిజన సంక్షేమ డిడిగా కృష్ణవేణి నియామక ఉత్తర్వులు వెలువడినట్లు తెలుస్తోంది.

మన్యంలో వణికిస్తున్న చలి

కనిష్ట స్థాయికి పడిపోతున్న ఉష్ణోగ్రతలు

ప్రజాశక్తి - కురుపాం

కురుపాం మన్యంలో చలితీవ్రత పెరుగుతోంది. రోజురోజుకూ రాత్రిపూట ఉష్ణోగ్రతలు కనిష్ట స్థాయికి పడిపోతున్నాయి. రాత్రివేళల్లో 13 నుంచి 16 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఉదయం 9 గంటల వరకు రోడ్లపై మంచుదుప్పటి వీడటం లేదు. చలి తీవ్రత పెరుగుతుండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యనిపుణులు సూచిస్తున్నారు. తీసుకునే ఆహారం నుంచి ధరించే దుస్తుల వరకు జాగ్రత్తలు తీసుకోవాలంటున్నారు. చలిలో తిరగడం వల్ల న్యూమోనియాతోపాటు వ్యాధులు, అలర్జీ వంటివి వచ్చే అవకాశం ఉందని, ఆస్తమా వ్యాధిగ్రస్తులు మరింత జాగ్రత్తగా ఉండాలని చెబుతున్నారు. చల్లగాలిలో ఉదయపు నడకకు వెళ్తే ఆస్తమా ఉన్నవారు శ్వాస సరిగ్గా తీసుకోవడం కష్టమంటున్నారు. మంచు ప్రభావం తగ్గిన తరువాత వెళ్లడం మంచిదని సూచిస్తున్నారు.

దట్టంగా మంచు కురుస్తుండటంతో లైట్లు వేసుకుని వెళ్తున్న ఆర్‌టిసి బస్సు

పాఠశాల సందర్శన

ప్రజాశక్తి-సీతానగరం

స్థానిక జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలను డిఇఒ నల్ల తిరుపతినాయుడు బుధవారం సందర్శించారు. పదో తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను పర్యవేక్షించారు. విద్యార్థులతో మాట్లాడి, పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు ఏ విధంగా సిద్ధపడుతున్నారని అడిగారు. అదే సమయంలో విద్యార్థి తన చదువు పట్ల కేటాయించే సమయాన్ని సూచించారు. విద్యార్థులు చదువుతోపాటు మొక్కలను పెంచాలన్నారు. అనంతరం ఆరో తరగతి నుంచి పదో తరగతి విద్యార్థుల వరకు నోట్ పుస్తకాలను పరిశీలించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒలు జి.సూరిదేముడు, ఎం.వెంకటరమణ, ప్రధానోపాధ్యాయులు ప్రసన్న లక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాలికల వికాసానికి పటిష్ట చర్యలు

ప్రజాశక్తి-పార్వతీపురం

బాల్య వివాహాలు, బాల్యంలో గర్భధారణ వంటి సంఘటనలు జరగకుండా అరికట్టి బాలికల వికాస దిశగా పటిష్ట చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అన్నారు. బుధవారం స్థానిక జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో మహిళా శిశు సంక్షేమ శాఖ, విద్యాశాఖ, గ్రామ వార్డు సచివాలయం, పోలీసు శాఖలతో కిశోర వికాసం కార్యక్రమంపై సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 11 ఏళ్ల నుంచి 18 ఏళ్ల వయస్సులోపు పాఠశాల, కళాశాల విద్యార్థులు, బడిబయట పిల్లలను గ్రూపులుగా విభజించాలని చెప్పారు. వారి సంరక్షణ, పోషణ అవసరాలు, కౌమార బాలికల సమస్యలు గుర్తించి వికాసానికి అవసరమైన పటిష్ట చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. బాల్య వివాహాలు అరికట్టడం, విద్య, ఉద్యోగ కల్పన, పౌష్టికాహారం అందించడం, ఆత్మ సంరక్షణ, లైంగిక వేధింపుల నుంచి రక్షణ వంటి అంశాలపై సమన్వయంతో నిర్మూలకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ పీడీ టి.కనకదుర్గ, సెట్విజ్ సిఇఒ బి.రామ్‌గోపాల్, జిల్లా విద్యా శాఖ అధికారి ఎన్.తిరుపతి నాయుడు, స్వచ్ఛంద సంస్థలు అప్‌హోల్డ్, నీడ్, ఐఆర్‌పిడబ్ల్యు సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

పట్టణాభివృద్ధి పాలకులకు పట్టదా?

పట్టణ పౌర సంక్షేమ సంఘం

మాట్లాడుతున్న పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు ఎన్‌వై నాయుడు

ప్రజాశక్తి-సాలూరురూరల్

సాలూరు పట్టణాభివృద్ధి పాలకులకు పట్టడం లేదా? అని పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు ఎన్.వై.నాయుడు నిలదీశారు. బుధవారం స్థానిక సిపిఎం కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. దశాబ్దాల క్రితం ఏర్పడిన సాలూరు మున్సిపాలిటీ అభివృద్ధికి నోచుకోవడం లేదన్నారు. పాలకులు మారుతున్నా, ప్రయోజనం ఏమీ లేదని చెప్పారు. గతంలో పాలకవర్గాన్ని వైసిపి నాయకుల చేతిలో పెడితే వారు కనీసం పట్టించుకోలేదన్నారు. దీంతో గత సాధారణ ఎన్నికల్లో టిడిపి అభ్యర్థిని భారీ మెజార్టీతో పట్టణ ప్రజలు గెలిపించారని, కానీ నేటికీ కనీస మౌలిక వసతులు కల్పించడానికి ముందుకు రావడం లేదని, ఇది పట్టణ ప్రజల దౌర్భాగ్యమని ఆవేదన వ్యక్తంచేశారు. పట్టణ అభివృద్ధి విషయంలో మున్సిపల్ పాలకవర్గం, అధికార పార్టీ నాయకత్వం చిత్తశుద్ధితో పనిచేయకపోవడం వల్ల సమస్యలు రోజురోజుకు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. 2014లో అప్పటి టిడిపి ప్రభుత్వ హయాంలో రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన రైతు బజారును నేటికీ ప్రారంభించక పోవడం పాలకుల నిర్లక్ష్యానికి నిదర్శనం కాదా? అని ప్రశ్నించారు. ప్రజాధనంతో నిర్మించిన టిడ్కో ఇళ్లు లబ్ధిదారులకు ఇవ్వడం లేదన్నారు. జగనన్న కాలనీలో స్థలాలు ఖాళీగా ఉన్నాయని, కట్టుకున్న వారికి కూడా పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పించలేదని చెప్పారు. పట్టణంలో అనేక వార్డుల్లో రోడ్లు లేవని తెలిపారు. పట్టణంలో ప్రభుత్వ లైబ్రరీ, ప్రభుత్వ ఐటిఐలు ఏళ్ల తరబడి అద్దె భవనాల్లో ఉన్నాయని గుర్తుచేశారు. పై సమస్యలు పరిష్కారం కోసం వెంటనే మున్సిపల్ పాలకవర్గం, మంత్రి కృషి చేయాలని, లేకుంటే ప్రజలను కలుపుకొని ఆందోళనకు సిద్ధమవుతామని హెచ్చరించారు. సమావేశంలో పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు ఈశ్వరరావు, ప్రసాద్, రవి, కళ్యాణ్ పాల్గొన్నారు.

కిటకిటలాడుతున్న గుమ్మలక్ష్మీపురం వారపు సంత

సంతకు సంక్రాంతి కళ

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

గుమ్మలక్ష్మీపురంలో బుధవారం జరిగిన గిరిజన వారపు సంత.. పండగ కళ సంతరించుకుంది. వచ్చే వారమే సంక్రాంతి పండగ ఉన్న నేపథ్యంలో గుమ్మలక్ష్మీపురం, కురుపాం మండలాల నుంచి ప్రజలు వేలాది సంఖ్యలో సంతకు తరలివచ్చారు. కొత్త బట్టలు, వంట పాత్రలు, పిండి వంటలు తయారీకి అవసరమయ్యే సామగ్రి, ఇతర వస్తువులను కొనుగోలు చేశారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు ప్రజల రాకతో వారపు సంత కిటకిటలాడింది.

విశాఖ సాక్షిగా మరోసారి ద్రోహం

ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక

ప్రజాశక్తి-పార్వతీపురం

విశాఖ సాక్షిగా మోడీ మరోసారి ద్రోహం చేసారని ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎం.శ్రీనివాస బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మోడీ ప్రసంగంలో రాష్ట్రాన్ని వేధిస్తున్న సమస్యలపై స్పందించక పోవడం తీవ్ర నిరాశకు గురి చేసిందని, ఆర్భాటంగా ఏర్పాటు చేసిన సభ, రోడ్ షోలకు తగ్గట్లుగా ప్రజలకు చేసిన మేలు లేదని పేర్కొన్నారు. ఆయన పదేపదే ప్రస్తావించిన గ్రీన్ ఎనర్జీ ప్రాజక్టు నిర్మాణం, ఆయన విధాన పరంగానే ద్వేషించే, ఒక ప్రభుత్వ రంగ పరిశ్రమ అయిన ఎన్‌టిపిసి ద్వారా జరగడం ద్వారా ప్రభుత్వ రంగ ప్రాధాన్యత తెలుస్తోందన్నారు. గత నాలుగేళ్లుగా కార్మికులు పోరాడుతున్నా మోడీ విశాఖ స్టీల్ ప్లాంట్ ఊసే ఎత్తలేదని, విభజన చట్ట ప్రకారం రావలసిన విశాఖ మెట్రో రైల్ మాట కూడా మాట్లాడలేదని తెలిపారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, వెనుకబడ్డ ప్రాంతాల అభివృద్ధి ప్యాకేజీల సంగతి పూర్తిగా మరిచారని పేర్కొన్నారు. పక్కనే ఉన్న ముఖ్య మంత్రి చంద్రబాబు. ఉప ముఖ్య మంత్రి పవన్ కళ్యాణ్ కనీసంగా కూడా అడగలేదు సరికదా, ఆయనను ప్రసన్నం చేసుకోవడానికే ఇద్దరూ పోటీ పడ్డారని విమర్శించారు. ముచ్చటగా ముగ్గురూ కలిపి ఈ సభా వేదికగా ఆంధ్ర రాష్ట్రానికి మోసం చేశారని తెలిపారు.. సభంతా ఒకర్నొకరు పొగుడుకోవడంతోనే సరిపోయిందని, ప్రజలు వద్దు మొర్రో అంటున్న నక్కపల్లి బల్క్ డ్రగ్స్ ప్లాంటుకు శంకుస్థాపన చేశారని, నిర్వాసితుల ఊసెత్తకుండా గ్రీన్ ఎనర్జీ, అత్యధిక ఆదాయం గడిస్తున్న విశాఖ రైల్వే డివిజన్ కొనసాగించాలని ఎంత కోరినా దాన్ని పక్కన పెట్టారని పేర్కొన్నారు. పదేళ్ళ నుండి ఊరిస్తూ, ఊరిస్తూ ఎట్టకేలకు రైల్వే జోన్ కు శంకుస్థాపన చేయడంలో గర్వ పడవలసిన దేముంది? పదేళ్ళ క్రితం రావలసినది ఇంత ఆలస్యం చేసినందుకా? అని విమర్శించారు.

చేతివృత్తుల వారికి నైపుణ్యాభివృద్ధి శిక్షణ

ప్రజాశక్తి-పాలకొండ

నగర పంచాయతీ పరిధిలో వివిధ రంగాల్లో పనిచేస్తున్న చేతి వృత్తుల వారికి నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇచ్చి, సర్టిఫికెట్లు అందజేయనున్నట్లు కమిషనర్ ఎస్.సర్వేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని ప్లంబర్లు, కార్పెంటర్లు, ఎలక్ట్రీషియన్లు, ఎసి, గ్రీజర్, టీవీ మెకానిక్స్, బ్యూటీషియన్స్‌తో పాటుగా వివిధ రకాల సేవలు అందించే వారందరికీ పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో హోం ట్రయాంగిల్ ప్లాట్‌ఫాం (శిక్షణ సంస్థ) ద్వారా నైపుణ్యాభివృద్ధి శిక్షణ అందిస్తామని, జీవనోపాధి కల్పిస్తామని తెలిపారు. అందుకు గాను గురువారం నగర పంచాయతీ మెప్మా విభాగం వద్ద మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అర్హత గల అభ్యర్థులు ఆధార్ కార్డు, రేషన్ కార్డు, పాన్ కార్డు, బ్యాంకు పాస్‌బుక్, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో హాజరై, పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు.

బెల్ట్‌షాపులు నిర్వహిస్తే చర్యలు

ప్రజాశక్తి-పాలకొండ

మండల పరిధిలో ఎక్కడైనా బెల్ట్ షాపులు నిర్వహిస్తున్నట్టు తెలిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ పి.బాలమురళీకృష్ణ అన్నారు. బుధవారం తన కార్యాలయంలో బెల్ట్‌షాపులు నిర్వాహకులపై బైండోవర్ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతి సందర్భంగా బెల్ట్‌షాపులు ఎవరైనా నిర్వహిస్తే లక్ష రూపాయలు వరకు జరిమానా విధిస్తామన్నారు. నాటుసారా విక్రయాలు జరిపినా తీవ్ర చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐ ఫణీంద్ర, డిప్యూటీ తహశీల్దార్ సన్యాసిరావు పాల్గొన్నారు.

బాల్యవివాహాలు నేరం

ప్రజాశక్తి-వీరఘట్టం

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని జిల్లా బాలల సంరక్షణ లీగల్ ప్రొఫెసర్ పి.శ్రీధర్ అన్నారు. బుధవారం స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో విద్యార్థులతో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో ఎక్కడైనా బాల్యవివాహాలు జరిగితే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. మహిళపై లైంగిక వేధింపులపై కూడా అవగాహన కల్పించారు. మహిళపై లైంగిక దాడులు జరిగితే 1098 నెంబర్‌కు కాల్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్లు జె.జ్ఞానమ్మ, ఎన్.రాజేశ్వరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా మారిన రహదారి

అదుపు తప్పితే ప్రమాదమే

ప్రజాశక్తి-వీరఘట్టం

వీరఘట్టంలోని ఒట్టిగడ్డ సమీపంలో ప్రధాన రహదారికి ఎటువంటి రక్షణ కవచాలూ లేవు. దీంతో ప్రమాదకరంగా మారింది. ఈ రహదారి మీదుగా నిత్యం వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. వాహనాలు ఏమాత్రం అదుపుతప్పినా ప్రమాదం బారిన పడాల్సిందే. ప్రమాదాలు సంభవించక ముందే ఆర్అండ్‌బి అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

హుండీ ఆదాయం లెక్కింపు

ప్రజాశక్తి - గరుగుబిల్లి

తోటపల్లిలోని వెంకటేశ్వర స్వామి దేవస్థానం హుండీలను బుధవారం తెరించి, ఆదాయాన్ని లెక్కించారు. వెంకటేశ్వర స్వామి ఆలయ హుండీల నుంచి రూ.3,51,594, కోదండ రామ స్వామి ఆలయ హుండీల నుండి రూ.12,490 వచ్చినట్లు ఇఒ వివి సూర్యనారాయణ తెలిపారు. గతేడాది అక్టోబర్ 29 నుంచి బుధవారం వచ్చిన ఆదాయాన్ని లెక్కించినట్లు చెప్పారు.

త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు

కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

ప్రజాశక్తి-పార్వతీపురం

జిల్లాలో ప్రధాన మంత్రి జన్‌మన్ పివిటిజి ఇళ్ల నిర్మాణ పనులు త్వరితగతిన చేపట్టాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఏర్పాటు ప్రధాన మంత్రి జన్‌మన్ పివిటిజి ఇళ్ల నిర్మాణం పనులపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాకు ప్రధాన మంత్రి జన్‌మన్ పివిటిజి పథకం కింద 2697 ఇళ్లు మంజూరు అయ్యాయని తెలిపారు. మార్చి 31 నాటికి 184 ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఇంటి స్థలం పొందిన ప్రతిఒక్కరూ నిర్మాణ పనులను మొదలు పెట్టాలన్నారు. మార్చి 31లోగా ఇళ్ల నిర్మాణం పూర్తి అయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో కురుపాం, గుమ్మలక్ష్మీపురం, సీతంపేట మండలాల్లో ఇంకా మెరుగైన అభివృద్ధి సాధించే దిశగా కృషి చేయాలన్నారు. గృహ నిర్మాణం చేపట్టేటప్పుడు రహదారి, మెటీరియల్ కాంపొనెంట్ లే ఔట్‌కి దగ్గర్లో ఉండేలా చూడాలని తెలిపారు. మంజూరైన ఇళ్ల స్థలాల్లో కచ్చితంగా నిర్మాణం చేపట్టాలని, ఈ నెలలో కనీసం పది ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో పునాదుల స్థాయి నుండి ఇంటి నిర్మాణం పూర్తి చేసేలా మెరుగవ్వాలని కలెక్టర్ అన్నారు. ఈ కార్యక్రమంలో గృహ నిర్మాణ సంస్థ పీడీ ఆర్.వంశీకృష్ణ, డిఇలు జి.సోమేశ్వరరావు, ఎం.వెంకటరావు, ఐటి మేనేజర్ పి.అనిల్‌కుమార్, సిఎల్‌టిసి పి.అరుణకుమారి పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

రక్తహీనత నివారణకు ప్రత్యేకాధికారులు

ప్రజాశక్తి-సీతానగరం

రక్తహీనత నివారణ చర్యలో భాగంగా ప్రత్యేకాధికారులను నియమించినట్లు ఎంపిడిఒ పి.త్రివిక్రమరావు తెలిపారు. బుధవారం మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెదంకలం, సీతానగరం పిహెచ్‌సిల పరిధిలో రక్తహీనత కలిగిన వారిని ముందుగా గుర్తించి, అవగాహన కల్పించి, నివారణ చర్యలు చేపట్టేందుకు ఆ అధికారి ప్రత్యేక బాధ్యత తీసుకోవాలని చెప్పారు. దీనివల్ల మరణాల రేటు తగ్గుతుందని తెలిపారు. కార్యక్రమంలో తహశీల్దార్ ప్రశాంత్ కుమార్, వైద్యాధికారులు ఎం.రాధాకాంత్, పి.పావని, ఇఒపిఆర్‌డి కెకె కుమార్ వర్మ, ఎంఇఒ జి.సూరిదేముడు, ఐసిడిఎస్ సూపర్వైజర్ పూర్ణిమ, పద్మావతి, సురేఖ తదితరులు పాల్గొన్నారు.

జీడికి మార్కెట్ ధర

మాట్లాడుతున్న పిహెచ్ఒ గణేష్

ప్రజాశక్తి-సీతంపేట

సీతంపేట ఏజెన్సీలో వెలుగు, విడివికెల ద్వారా జీడి పిక్కలను కొనుగోలు చేసి మార్కెట్ ధర కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఐటిడిఎ హార్టికల్చర్ అధికారి ఎస్‌వి గణేష్ తెలిపారు. మండలంలో గొయిది గ్రామంలో బుధవారం వెలుగు, ఉద్యాన, వ్యవసాయ శాఖల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా సంఘాలు, వన్‌ధన్ వికాస్ కేంద్రాల ద్వారా అప్పుడున్న ధరలను బట్టి జీడి కొనుగోలు చేస్తామని చెప్పారు. మహిళా సంఘాలు ఆర్థిక అభివృద్ధి చెందడానికి చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఇప్పటికే సీతంపేట విడివికెల ద్వారా 1800 మంది మహిళా రైతులను గుర్తించినట్లు తెలిపారు. జీడి పరిశ్రమలు స్థాపించి, జీడి పిక్కలను ప్రాసెసింగ్ చేసి టిటిడికి, జిసిసికి విక్రయించేందుకు చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. మార్చి నెలలో జీడి తయారయ్యే సరికి కొనుగోలు ప్రక్రియ మొదలు పెడతామన్నారు. మహిళా రైతులకు చేయూతనివ్వడానికి కలెక్టర్ ప్రణాళికలు రూపొందించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో వ్యవసాయ అధికారి పి.శ్రీదేవి, జిల్లా శిక్షణ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, మట్టి శాస్త్రవేత్త సౌజన్య, హెచ్ఒ జయశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

నియామక పత్రాలు అందజేత

ప్రజాశక్తి-సీతంపేట

సీతంపేట వైటిసిలో నిర్వహిస్తున్న నైపుణ్య కళాశాలలో శిక్షణ పొందిన 40 మందికి ఉద్యోగ నియామక పత్రాలను ఐటిడిఎ ఎపిఒ జి.చిన్నబాబు బుధవారం అందజేశారు. హైదరాబాద్‌లోని సుదర్శనీ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ఇటీవల కాలంలో ఆన్‌లైన్‌లో ఇంటర్వ్యూలు నిర్వహించింది. 60 మంది హాజరు కాగా 18 మంది పురుషులు 22 మంది, మహిళలు 40 మంది ఎంపికైనట్లు ఎపిఒ తెలిపారు. ఇన్ఫోటెక్ కంపెనీకి 16 మందికి ఎంపికైనట్లు చెప్పారు. కార్యక్రమంలో నైపుణ్య కళాశాల మేనేజర్ జె.రవికుమార్, కోఆర్డినేటర్ వెంకటరమణ, కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.



నియామక పత్రాలు అందజేస్తున్న ఐటిడిఎ ఎపిఒ చిన్నబాబు

రోడ్డు ప్రమాదాలపై అవగాహన

ప్రజాశక్తి-సీతంపేట

సీతంపేట గిరిజన బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ఎఎస్ఐ సంజీవ్ రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. దానిలో భాగంగా హెల్మెట్ తప్పనిసరిగా వాడాలని అన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని చెప్పారు. వాహన సాధకులకు లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలన్నారు. సైబర్ నేరాల గురించి అవగాహన కల్పించారు. గుట్కా, గంజాయి, పాన్ వంటి మత్తు పదార్థాలకు యువకులు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు చంద్రావు, డిప్యూటీ వార్డెన్ రామ్మోహన్‌రావు, ఉపాధ్యాయులు గాసయ్య, సూరిబాబు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీతానగరం.. మాట్లాడుతున్న ఎస్ఐ రాజేష్

సీతానగరం : జోగింపేట స్కూల్ ఆఫ్ ఎక్సలెన్సీలో బుధవారం రోడ్డు ప్రమాదాల నివారణ చర్యలపై విద్యార్థులకు ఎస్ఐ ఎం.రాజేష్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వాహనదారుడు తప్పక హెల్మెట్ ధరించాలన్నారు. విద్యార్థులు మత్తు పానీయాలకు బానిసలు కాకూడదని చెప్పారు. చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీరాములునాయుడు వర్ధంతి

ప్రజాశక్తి-వీరఘట్టం

మండలంలోని నడుకూరు గ్రామంలో బుధవారం మాజీమంత్రి గొర్లె శ్రీరాములు నాయుడు వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంధ్ర యూనివర్సిటీ పాలకమండలి మాజీ సభ్యులు వై.వెంకటనాయుడు మాట్లాడుతూ నీతి నిజాయితీలకు మారుపేరుగా, నిబద్ధత కలిగి రాజకీయ నాయకునిగా శ్రీ రాములు నాయుడు నిలిచారని కొనియాడారు. నేటి తరం నాయకులు శ్రీరాములు నాయుడును ఆదర్శంగా తీసుకుని నీతివంతమైన సేవలు ప్రజలకు అందించాలని కోరారు. తొలుత శ్రీరాములునాయుడు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపిటిసి వై.జయశ్రీ, వాన త్రినాథనాయుడు, సంభాన చంద్రమౌళీశ్వర రావు, కె.శ్రీరామమూర్తి, మంతిని పకీర్‌నాయుడు, అలుగోలు కన్నమనాయుడు, దుర్గారావు, కె.సాయి, తదితరులు పాల్గొన్నారు.



శ్రీరాములునాయుడు చిత్రపటానికి పూలమాల వేస్తున్న వెంకట నాయుడు

పండగ సమయాల్లో జాగ్రత్తలు పాటించాలి

ప్రజాశక్తి-కొమరాడ

పండగ సమయాల్లో ప్రజలు జాగ్రత్తలు పాటిస్తూ ప్రమాదాలకు గురికాకుండా ఉండాలని కొమరాడ ఎస్ఐ కె.నీలకంఠం అన్నారు. బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో ప్రజలకు రోడ్డు ప్రమాదాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మద్యం సేవించి మితిమీరిన వేగంతో వాహనాల నడిపి ప్రమాదాలకు కారణం కావొద్దన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

హైకోర్టు ఉత్తర్వు తీసుకునేందుకు పిఒ నిరాకరణ

- మధ్యాహ్నం వరకు చంటిబిడ్డతో అంగన్‌వాడీ హెల్పర్ నిరీక్షణ
- యూనియన్ డిమాండ్‌తో ఉత్తర్వు కాపీ స్వీకరించిన సిబ్బంది

ప్రజాశక్తి-గజపతినగరం

రాజకీయ కక్ష సాధింపుల్లో భాగంగా తొలగించిన రామన్నపేట అంగన్‌వాడీ కేంద్రం హెల్పర్ మానాపురం సౌజన్యను తక్షణం విధుల్లో తీసుకోవాలంటూ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వు కాపీని స్వీకరించేందుకు గజపతినగరం ఐసిడిఎస్ ప్రాజెక్టు పిఒ నాగమణి మీనమేషాలు లెక్కించారు. మధ్యాహ్నం వరకు ఐసిడిఎస్ కార్యాలయం వద్ద బాధితురాలిని వేచి ఉంచి చివరకు తీసుకునేందుకు నిరాకరించడంతో యూనియన్ డిమాండ్ మేరకు సిబ్బంది స్వీకరించారు. అంగన్‌వాడీ హెల్పర్ సౌజన్యను రాజకీయ వేధింపుల్లో భాగంగా గత ఏడాది నవంబర్ 30న అధికారులు తొలగించారు. అక్రమ తొలగింపునకు నిరసనగా అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యాన సౌజన్య ఒకవైపు పోరాటం చేస్తునే మరోవైపు న్యాయపోరాటం కోసం హైకోర్టును ఆశ్రయించారు. దీంతోఆమెను విధుల్లోకి తీసుకోవాలని హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చింది. ఈ ఉత్తర్వులను తీసుకొని గురువారం ఉదయం 11 గంటలకు గజపతినగరం ఐసిడిఎస్ పిఒ నాగమణి వద్దకు సౌజన్య వెళ్లారు. తాను మీటింగ్‌లో ఉన్నానని, తరువాత వచ్చి తీసుకుంటానని చెప్పారు. మధ్యాహ్నం 2గంటల సమయంలో తాను ఆ ఉత్తర్వులు తీసుకునేది లేదని కార్యాలయ సిబ్బందితో చెప్పించారు. దీంతో స్పందించిన యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు వి.లక్ష్మి విలేకర్లతో మాట్లాడుతూ హైకోర్టు ఉత్తర్వులు తీసుకునేందుకు నిరాకరిస్తున్న పిఒ రేపు సౌజన్యతో ఏ విధంగా ఉద్యోగం చేయిస్తారా అని భయం కలుగు తుందన్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నం 2.30గంటల వరకు చంటిపిల్లతో పిఒ కార్యాయలయం వద్ద సౌజన్యం వేచి ఉంటే ఉత్తర్వులు తీసుకునేందుకు నిరాకరించడం సరైనది కాదని అన్నారు. శిక్షణకు వచ్చిన అంగన్‌వాడీలను ఎటువంటి ధర్నాలకు వెళ్లవద్దని వారిని బెదిరించి సంతకాలు తీసుకోవడం ఆమె దౌర్జన్యానికి పరాకష్ట అని అన్నారు. అనంతరం అంగన్‌వాడీలంతా పిఒను ప్రశ్నించడంతో కార్యాలయం సిబ్బంది ఆ ఉత్తర్వు కాపీని తీసుకున్నారు. జిల్లా కలెక్టర్ స్పందించి అన్ని రకాలుగా అంగన్‌వాడీలను ఇబ్బంది పెడుతున్న పిఒను సస్పెండ్ చేయాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ ప్రాజెక్టు కార్యదర్శి పి.జ్యోతి పాల్గొన్నారు.

పంట మార్పిడితో రైతుకు లాభం

డిపిఎం షణ్ముఖ రాజు

ప్రజాశక్తి - గరుగుబిల్లి

పంటల మార్పిడి విధానంతో రైతులకు లాభమని ప్రకృతి వ్యవసాయం డిపిఎం షణ్ముఖరాజు తెలిపారు. మండలంలోని పిట్టలమెట్ట గ్రామంలో రెడ్డి లక్ష్మునాయుడు వ్యవసాయ క్షేత్రంలో రబీలో సాగుచేసిన పంటలను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్లో వరి పంట పూర్తయ్యాక, రబీలో పెసర 80 శాతం, మిగతా విస్తీర్ణంలో అంతర పంటలైన కొమ్ముశనగ, తోటకూర, గోంగూర, ముల్లంగి, బెండ, చిక్కుడు, తదితర విత్తనాలు వేయడం వల్ల పంటల్లో వైవిధ్యం వస్తుందన్నారు. దీనివల్ల కుటుంబ అవసరాలు తీర్చడంతోపాటు మిగతావి విక్రయించడం ద్వారా ఆదాయం లభిస్తుందన్నారు. భూమిని పచ్చగా ఉంచడంతోపాటు నీటి నిల్వ సామర్థ్యం కలిగి ఉంటుందని తెలిపారు. ప్రతిఒక్కరూ పంట మార్పిడి విధానం పాటించడం వల్ల పంటల దిగుబడితోపాటు భూ వైవిధ్యాన్ని పరిరక్షించుకోవచ్చని తెలిపారు. జిల్లాలోని 15 మండలాల్లో ఈ విధమైన కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆర్.లక్ష్మునాయుడు, డి.వెంకట్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

అపరాల మొక్కలను పరిశీలిస్తున్న డిపిఎం షణ్ముఖ రాజు

అపరాల సాగులో జాగ్రత్తలు పాటించాలి

సీతానగరం : అపరాల పంటల సాగులో జాగ్రత్తలు పాటించాలని మండల వ్యవసాయ శాఖ అధికారి ఎస్.అవినాష్ అన్నారు. మండలంలోని వెన్నెలబుచ్చెంపేట గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత దశలోనే కలుపు మొక్కలు ఎక్కువగా ఉండి, పంట ఎదుగుదలకు ఆటంకం అవుతాయని చెప్పారు. కలుపు నివారణకు 19-19-19 మల్టీకే ఒక కేజీ చొప్పున పిచికారీ చేసుకోవాలన్నారు. వాతావరణంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా కొన్ని జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఇఒ జగదీష్ పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

పోక్సో కేసులో ఇద్దరికి మూడేళ్ల జైలు

ప్రజాశక్తి-విజయనగరంకోట

విజయనగరం మహిళా పోలీసు స్టేషన్లో 2021లో నమోదైన పోక్సో కేసులో నిందితులు విజయనగరం పట్టణానికి చెందిన కోడూరు విజయకుమార్ (36), కోడూరు శైలజ (32)కు మూడేళ్ల జైలు శిక్ష విధిస్తూ పోక్సో ప్రత్యేక న్యాయమూర్తి కె.నాగమణి తీర్పుచెప్పారు. నగరంలోని విటి అగ్రహారం బిసి కాలనీకి చెందిన 13ఏళ్ల బాలిక తల్లిదండ్రులు గొడవపడి విడిపోయారు. తరువాత బాలిక తల్లి విజయనగరం పట్టణం గాడీఖానా రైల్వే క్వార్టర్స్‌లో నివాసం ఉంటున్న నిందితుడు కోడూరు విజయ కుమార్‌తో ఉంటోంది. బాలిక మాత్రం బిసి కాలనీలో ఉంటున్న అమ్మమ్మ దగ్గర ఉంటూ చదువుకుంటోంది. అమ్మ ఒడి డబ్బులు విషయమై ఆ బాలిక శైలజ వద్దకు వెళ్లింది. ఆ సమయంలో విజయ్‌కుమార్ బాలికను లైంగికంగా వేధించగా, అందుకు తల్లి శైలజ సహకరించినట్లు బాలిక పోలీసులకు ఫిర్యాదు చేసింది. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి నిందితులకు మూడేళ్ల జైలుశిక్ష, రూ.2500 జనిమానా విధించారు.

రైలు కింద పడి వృద్ధుడు మృతి

ప్రజాశక్తి- బాడంగి

డొంకినవలస రైల్వే స్టేషన్ దగ్గర ఫ్లాట్‌ఫామ్‌పై నుంచి జారిపడి డొంకినవలస గ్రామానికి చెందిన బంకురు సూర్యనారాయణ (71) మృతి చెందాడు. బొబ్బిలి జీడీపీ హెచ్‌సి ఈశ్వరరావు చెప్పిన వివరాలు ప్రకారం.. బుధవారం సాయంత్రం బొబ్బిలి నుంచి వస్తున్న గూడెసు రైలు ఫ్లాట్‌ఫామ్ వద్దకు వచ్చే సరికి అప్పటికే ఫ్లాట్‌ఫామ్ పై ఉన్న సూర్యనారాయణ కాలుజారి ఒక్కసారిగా పట్టాలపై పడిపోయాడు. దీంతో రైలు ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు.

రూ.వెయ్యి.. ప్రాణం తీసేలా చేసింది

●పథకం ప్రకారమే హత్య ● ఎరుకొండ కేసులో నేరం అంగీకరించిన నిందితుడు

ప్రజాశక్తి - పూసపాటిరేగ

వెయ్యి రూపాయలు కోసం తగాదాయే తన స్నేహితుడు, తన తోటి పనివాడైన గొర్లె పవన్‌కుమార్ (22)ను హత్య చేయడానికి కారణమైందని నిందితుడు బొంతు అప్పలనాయుడు పోలీసులు ముందు అంగీకరించినట్లు భోగాపురం రూరల్ సిఐ రామకృష్ణ తెలిపారు. ఎరుకొండ హత్యకేసులో నిందుతుడును పట్టుకొని కోర్టుకు తరలిస్తున్నట్లు బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో విలేకర్ల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. నిందితుడు అప్పలనాయుడు, పవన్‌కుమార్‌తో పాటు మరి కొంత మంది కలసి పూసపాటిరేగ చుట్టు పక్కల ఇళ్లకు రంగులు వేస్తుంటారు. రంగలు వేసిన తరువాత కూలీని అప్పలనాయుడు తెచ్చి మిగతా వారికి పంచుతాడు. అలా పవన్‌కు సంబంధించిన రూ. 1000లు అప్పలనాయుడు దగ్గర ఉండిపోయింది. ఎన్నిసార్లు అడిగినా ఇవ్వకపోవడంతో పవన్‌కు కోపం వచ్చి తగాదా పడి అందరి ముందు అప్పలనాయుడును అవమానించాడు. దీంతో ఎలాగైనా పవన్‌ను హత్యచేయాలని అప్పలనాయుడు పథకం పన్నాడు. గోడలకు సున్నాలు గోకుకునే బ్లేడును జేబులో ఉంచుకొని ఈ నెల 5వ తేది రాత్రి మద్యం సేవించారు. గ్రామానికి చెందిన వైఎస్ఆర్ విగ్రహం వద్ద రాత్రి 10 గంటలు సమయంలో మరలా ఇద్దరూ ఘర్షణ పడ్డారు. కొంత సేపటి తరువాత అప్పలనాయుడు బైక్‌పై పవన్ ఎక్కి వెలుతున్నారు. పవన్ తన ఇంటి దగ్గరకు వచ్చే సరికి బైక్ నుంచి గెంతేసాడు. ఎందుకు గెంతేసావని అప్పలనాయుడు, పవన్‌కు మధ్య మరలా ఘర్షణ జరిగింది. ఈ ఘర్షణలో అప్పలనాయుడు పథకం ప్రకారం తెచ్చుకున్న బ్లేడ్‌తో పవన్ కడుపులో నాలుగు పోట్లు పొడిచాడు. పవన్ కేకలు వేయడంతో వెంటనే పవన్ అమ్మ, అమ్మమ్మ బయటకు వచ్చారు. వెంటనే అప్పలనాయుడు అక్కడి నుంచి బైక్‌పై పారిపోయాడు. తీవ్రంగా గాయపడిన పవన్ అక్కడికక్కడే మృతి చెందాడు. పవన్ మృతి చెందాడన్న విషయం తెలుసుకున్న అప్పలనాయుడు సమీపంలోని తోటల్లోకి వెల్లిపోయాడు. విశాఖపట్నం వెల్లిపోవాలని ప్రయత్నిస్తుండగా పోలీసులకు దొరికి పోయాడని సిఐ తెలిపారు. అతనిపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలిస్తున్నామని చెప్పారు. సమావేశంలో ఎస్ఐ దుర్గాప్రసాదర్ ఉన్నారు.

1200 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

ప్రజాశక్తి-మెంటాడ

మండల సరిహద్దులోని అరకు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో రొంపిల్లి, నెల్లిగుడ్డి, కోటపర్తివలస, సోట్టొడివలస, రాబ తదితర గ్రామాలలో బుధవారం అంతర జిల్లా ఎక్సైజ్ సిబ్బంది దాడులు నిర్వహించారు. కోట పర్తవలస గ్రామ కొండ శిఖర ప్రాంతంలో నాటుసారా తయారీకి వినియోగించే సుమారు 1200 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను గుర్తించి ధ్వంసం చేశారు. కొండశిఖరంలో సారా తయారీ జరుగుతుందని అందిన సమాచారం మేరకు ఎక్సైజ్ అధికారులు మూకుమ్మడి దాడులు చేశారు. అధికారుల రాకను గమనించిన సారా తయారీ దారులు పరారయ్యారు. ఈ సంద ర్భంగా సమీప గ్రామాల్లో ఉన్న సారా, కల్లు తయారీ, అమ్మకం దారులకు అవగాహన కల్పించారు. వాటి వినియోగం వల్ల కలిగే ఆరోగ్య సమస్యలు వివరించారు. క్రయ, విక్రయాలు జరిపితే పీడీ యాక్ట్ నమోదు చేస్తామని హెచ్చరించారు.

కలకలం రేపిన యువకుడి అదృశ్యం

ప్రజాశక్తి - భోగాపురం

రాత్రివేళ బహిర్భూమికి వెళ్ళేందుకు రోడ్డుపైకి వచ్చిన ఒక యువకుడు అదృశ్యమయ్యాడు. దీంతో గ్రామంలో కలకలం రేగింది. బైకులపై కొంత మంది వచ్చి ఎత్తుకుపోయారనే ప్రచారం జోరందు కుంది. దీంతో కుటుంబ సభ్యులు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సంఘటన మండలంలోని తీర ప్రాంతమైన చినకొండ్రాజుపాలెం గ్రామంలో జరిగింది. వివరాల్లోకి వెళ్తే... గ్రామానికి చెందిన గనగళ్ళ దానయ్య (30) వివాహమై ఇద్దరు పిల్లలు ఉన్నారు. మంగళవారం రాత్రి 9 గంటలు ప్రాంతంలో భోజనం చేసి బయటకు బహిర్భూమికి వెళ్ళేందుకు వచ్చాడు. ఆ తరువాత ఎంతసేపటకి తిరిగి రాకపోవడంతో వెంటనే కుటుంబ సభ్యులు గ్రామస్తులకు, బంధువులకు చెప్పడంతో రాత్రంతా వెతికారు. అతని వెంట సెల్‌ఫోన్ కూడా తీసుకు వెళ్ళలేదు. బుధవారం ఉదయం చోడిపిల్లిపేట, కొండ్రాజుపాలెం గ్రామాలకు చెందిన మత్స్యకా రులందరు సముద్ర తీరాన, తోటల్లోన వెతికారు. కాని ఎక్కడా ఆచూకి లభించలేదు.

కిడ్నాప్‌కు గురయ్యాడంటూ ప్రచారం

మంగళవారం రాత్రి దానయ్య బయటకు వెళ్లిన సమయంలో నాలుగు బైకులపై కొంత మంది యువకులు వచ్చినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. వీరు ఏమైనా కిడ్నాప్ చేసి ఉంటారనే అనుమానాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఇదే జరిగితే బైకలపై వచ్చిన వ్యక్తులు ఎవరై ఉంటారని గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. లేదా ఇంకేమైనా జరిగిందనే దానిపై పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది. బుధవారం ఉదయం కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారని ఎస్ఐ పాపారావు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో హెడ్‌కానిస్టేబుల్ మృతి

గంట్యాడ : మండలంలోని కొండతామరపల్లి జంక్షన్ వద్ద బుధవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎపిఎస్‌పి బెటాలియన్‌కు చెందిన హెడ్ కానిస్టేబుల్ ఎన్‌వి రమణ మృతి చెందారు. మరో కానిస్టేబుల్ గురునాథ్‌రెడ్డి తీవ్రంగా గాయపడ్డారు. రమణ అనంతగిరిలో విధులు ముగించుకుని విజయనగరం వైపు వస్తుండగా విజయనగరం నుంచి అనంతగిరి విధులకు వెళుతున్న గురునాథ్‌రెడ్డి ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీ కొట్టాయి. ఈ ప్రమాదంలో రమణ అక్కడికక్కడే మృతి చెందగా గురునాథ్ రెడ్డి తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాద సమాచారం అందుకున్న విజయనగరం సిఐ లక్ష్మణరావు గంట్యాడ ఎస్ఐ సాయికృష్ణ పోలీస్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకున్నారు. తీవ్రంగా గాయపడిన కానిస్టేబుల్‌ను 108 వాహనంలో విజయనగరం ఆసుపత్రికి తరలించారు.